'కళ్ళు రెండూ మండుతున్నాయి. సెప్టిక్ అవుతుందని భయంగా వుంది. ఇంజక్షనివ్వండి. అందుకే వచ్చాను.' (కాదు. కాదు...శశిని చూసి ఆమె అభిప్రాయాలు ఎలా వున్నాయో చూద్దామని.)

సావంత్ నాకేసి విచిత్రంగా నవ్వి తనే కట్టు విప్పాడు. మందురాసి తిరిగి కట్టాడు కాని శశినిమాత్రం పిలవలేదు.

'ఇంతచిన్న విషయానికి బాధపడేవారినిమిమ్మల్ని ఒక్కర్నే చూశాను.' అన్నాడు సావంత్. ఇంతలో మరో ఇద్దరు పేషంట్లు వచ్చారు. వాళ్ళను గమనించటంలో నిమగ్నుడయ్యాడు. శశి యింకావచ్చివుండదు. వస్తే కనిపించదూ? ఆమె ఎడ్రసు తెలుసుకోవాలి. అక్కడక్కడా చెదిరిపడివున్న ముక్కలన్నిటినీ జాగ్రత్తగాఏరి దుమ్మూ ధూళీ దులిపేసి ఓహృదయాన్ని తయారుచేయటం అంత సులభతరమైంది కాదు. సావంత్ ని అడిగితే ఏమనుకుంటాడో! బొంబాయిలో కనిపించే ప్రతీ నర్సువంకచూస్తూ వాళ్ళనుగురించి ఆలోచిస్తూ కాలం వృధాచేసుకుంటున్న పిచ్చివాడనుకుంటాడు.

వెళ్ళిపోతూ ఓ పేషంటు అడిగాడు: 'నర్సు కనిపించదేం?'

'ఆమె నిన్నటినుండి మానుకుంది. మరో నర్సును వెదకి పెట్టుకోవాలి!'

చేతిలో ఏదో దొరికిందని ఇతరులకు కనపడకుండా గుప్పిట్లో దాచుకుంటే అదికూడా అదృశ్యమైంది.

'డాక్టర్! మీరు మరోలా అనుకోకుండావుంటే ఓమాటడుగుతాను' అతను తల నిలువునా ఆడించాడు.

'నిన్నటివరకూ నర్సుగావున్న శశి తెలుగుదేశపు అమ్మాయేనా?'

అతను ఓనిమిషం ఏమీ చెప్పక అదోలాచూసి పకపక నవ్వేశాడు.

'మీ డిస్కవరీ సరైందికాదు. ఆమె మరాఠీపిల్ల. మరాఠీలకూ తెలుగువారికి అనేకవిషయాల్లో పోలికలు వున్నాయి. అయినా ఏదేశమైతేనేం? ఇంగ్లీషు తెలుసుగా!'

నవ్వేసి బయటకొచ్చేశాను. రోడ్డుమీద అడుగు పెట్టగానే అది విషాదంగా మారింది. మనిషిని పోలిన మనిషి వుండవచ్చు. ఒక్కొక్కప్పుడు దూరాన్నుంచి ఒకర్ని చూసి మరొకరనుకోవచ్చు. కాని శశి విషయంలో పొరపడటం అసంభవం-అయినా సావంత్ కు నాతో అబద్ధం చెప్పవలసిన అవుసరం ఏముంది?

లంచిటైములో నాకేదో ఫోన్ కాల్ వచ్చిందని నా పక్కనే వున్న టైపిస్టు చెప్పింది.

'ఎవరో శివరావట-మీరూ అతనూ కలిసి కాలేజీలో చదువుకున్నారట'-అతను 'చార్నీరోడ్ దుర్గా నర్సింగుహోం' సెకండుఫ్లోరులో వున్నాడట-మిమ్మల్ని వెంటనే వచ్చి కలుసుకోమన్నాడు.

శివరావు, నేనూ నాలుగు సంవత్సరాలపాటు కాలేజీలో చదువుకున్నాం-అతను కులాసాపురుషుడు. చదువు సంగతి దేవుడికే తెలియాలికాని అతనుమాత్రం కొత్తగా దిగుమతి అయ్యే చైనీస్-జపానీస్-నూట్లు వేసుకుని సిగరెట్లు కాలుస్తూ వెయిటింగ్ రూంలో కూర్చుని డిటెక్టివ్ నవలలు, చవుకబారు రకంలోకి వచ్చే 'వుడ్ హౌస్' నవలలు చదువుతూ కాలం గడిపేవాడు. అంతేకాకుండా శివరావు అప్పుడప్పుడు పద్యాలు కూడా రానూండేవాడు. అవి చది వినిపించేవాడు. వినే అదృష్టం (గురదృష్టం?) నాకు కలిగేది. సాయంత్రం ఆఫీసు విడిచిపెట్టాక అక్కడకు వెళ్ళాను. శివరావు నన్ను గుర్తుపట్టాడు.

ఎత్తుగావున్న ముక్కాలిపీట లాక్కుని అతని మంచానికి దగ్గరగా కూర్చున్నాను. సర్జికల్ వార్డులో వున్నాడు కనక ఏదో ఆపరేషన్ జరిగివుంటుంది.

'ఇంతకాలంగా బొంబాయిలోవుంటూ ఒక్కసారైనా నాకు కనిపించావు కావు. కనీసం నా గురించి తెలుసుకోటానికైనా ప్రయత్నించలేదు. ఇది సహించరాని మొదటి నేరం' అంటూ మొదలుపెట్టాడు. అతని ధోరణి పిసరంతైనా మారలేదు.

'ఆ ప్రశ్న నిన్ను నేనడగాలనుకున్నా.'

పక్కనే ఓ పేషంటు గట్టిగా మూలిగాడు. ఆ వాతావరణంచూస్తే కంపమెత్తింది.

'అసలు నిన్నిక్కడకెందుకు పిలింపించానో తెలుసా? మనం కాలేజీచదువు వెలగబెట్టినప్పుడు సినిమాలకు, టిఫిన్లకు, డ్రామాలకు-కలుపుకుని నీ కోసం నా పర్సులోంచి ఎనభైరూపాయల పావలా ఖర్చుపెట్టాను. అది వడ్డీతోసహా వంద రూపాయలై

